RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 111 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం | 24.10.2026 | పేజీలు : 8

మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఆదేశం
- బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన
- అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి



నిత్యం నిఘా, హైదరాబాద్ : రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో కేసీఆర్

చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి : కేటీఆర్

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శలు

» 2

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్..

బీజేపీ సంచలన ఆరోపణలు



- రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ
- ఈ వివాదంతో తన కుమారుణ్ని తెరపైకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారన్న భండారీ
- రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్న
- రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్

» 2

ఎస్‌బీఐ కస్టమర్ల డబ్బుకు ఢోకా లేదు..

డేటా లీక్‌పై బ్యాంకు స్పష్టత

- డేటా లీక్ ఘటన తర్వాత ఖాతాదారుల డబ్బు సురక్షితమేనని ఎస్‌బీఐ స్పష్టీకరణ
- డార్క్ వెబ్‌లో 3,897 మంది ఖాతాదారుల రికార్డులు బయటపడినట్లు గుర్తింపు
- ప్రభావిత ఖాతాదారులకు ఈమెయిల్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం



వివరాలు 2 లో

డంపింగ్ యార్డ్ కాలుష్యంపై నిరాహార దీక్ష చేస్తా : మల్లారెడ్డి



- జవహర్ నగర్ డంప్ యార్డ్‌పై ఆమరణ దీక్ష చేస్తానన్న మల్లారెడ్డి
- రోజుకు ఇద్దరు అనుమానాస్పదంగా చనిపోతున్నారని ఆవేదన
- డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్

» 2

సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్..

మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్



- గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో గ్యాస్ లీక్ ప్రమాదం
- ఇద్దరు కార్మికుల దుర్మరణం
- సిగాచీ ఘటన నుంచి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదన్న హరీశ్

» 2



హైదరాబాద్‌లో తాగునీటి కొరతకు చెక్..

'గ్రీన్ వాటర్' సరఫరాకు జలమండలి ప్రణాళిక

- హైదరాబాద్‌లో 'గ్రీన్ వాటర్' సరఫరాకు జలమండలి సన్నాహాలు
- తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గించడమే ప్రధాన లక్ష్యం
- కోకాపేటలో గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు పరిశీలన
- నిర్మాణాలు, పరిశ్రమలకు శుద్ధి చేసిన నీటిని అందించే యోచన

» 2

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

- హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం
- మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి సూచన



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన....

2

ఏఐతో మానవాళికి ముప్పు.. గూగుల్ మాజీ సైంటిస్ట్ హెచ్చరిక!



- అత్యంత శక్తిమంతమైన ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలని సూచన
- ఏఐతో ఉద్యోగాలకు ముప్పు అతిశయోక్తేనన్న మరో ప్రముఖ నిపుణుడు
- ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ఏఐపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన నిపుణులు

» 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

డంపింగ్ యార్డ్ కాలుష్యంపై నిరాహార దీక్ష చేస్తా : మల్లారెడ్డి




మొదటిపేజీ తరువాయి.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా త్వరలోనే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ఆయన ప్రకటించారు. జవహర్ నగర్‌పై ఓ అమెరికన్ యూనివర్సిటీ విడుదల చేసిన సర్వే ఫలితాలు తనను తీవ్రంగా కలచివేశాయని అన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి భావోద్వేగంతో మాట్లాడారు. "జవహర్ నగర్ నా నియోజక వర్గంలో ఉంది. అది నా గుండెకాయ. ప్రపంచంలోనే అత్యధికంగా మీథేన్ విషవాయువులు విడుదలవుతున్న ప్రాంతాల్లో జవహర్ నగర్ 4వ స్థానంలో ఉందని సర్వే చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో రోజుకు కనీసం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మరణిస్తున్నారు. వారి మృతికి కారణాలు తెలియడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించాలని మల్లారెడ్డి కోరారు. డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. 2006లో డంపింగ్ యార్డ్ నిర్వహణకు రాంకీ సంస్థతో ఒప్పందం జరిగిందని, కానీ ఆ సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతం విషవలయంగా మారిందని ఆయన ధ్వజమెత్తారు.

ఏఐతో మానవాళికి ముప్పు.. గూగుల్ మాజీ సైంటిస్ట్ హెచ్చరిక!

మొదటిపేజీ తరువాయి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానవాళికి వరమా లేక శాపమా అనే చర్చ తీవ్రంగా జరుగుతున్న వేళ, దీనిపై నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీలో జరుగుతున్న 'ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2026'లో ఈ అంశంపై కీలక చర్చ జరిగింది. ఏఐ వల్ల "అదుపు చేయలేని మేధో విస్ఫోటనం" సంభవించే ప్రమాదం ఉందని గూగుల్ డీప్‌మైండ్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సదస్సులో "మానవాళిని ఏఐ తుడిచిపెట్టేస్తుందా?" అనే అంశంపై జరిగిన చర్చలో అలెక్స్ టర్నర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, "ఏఐతో మనం ఎంతో ప్రయోజనం పొందవచ్చు. కానీ, ప్రపంచాన్ని ప్రమాదంలో పడవేసే 'అదుపులేని మేధో విస్ఫోటనాన్ని' మనం నిరోధించాలి. ఇందుకోసం అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థల అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి" అని సూచించారు. అయితే, ఇదే సదస్సులో పాల్గొన్న మరో ప్రముఖ ఏఐ నిపుణుడు ఆండ్రూ ఎన్జీ కూడా స్పందించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే భయాలు అతిశయోక్తి అని ఆయన అన్నారు. "నిజాయతీగా చెప్పాలంటే, ఏఐ ఇంకా అంత మెరుగ్గా పనిచేయడం లేదు. చాలా ఉద్యోగాలను నాశనం చేసేంత సామర్థ్యం దానికి ఇంకా రాలేదు. కాబట్టి కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటూ ఉంటే ఉద్యోగాలకు ఢోకా ఉండదు" అని ఆయన భరోసా ఇచ్చారు. ఇటీవల కాలంలో మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్‌తో పాటు ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి సంస్థల అధినేతలు కూడా ఏఐ భద్రతపై ఆందోళనలు వ్యక్తం చేయడం గమనార్హం. ఎన్డీటీవీ కథనాల ప్రకారం.. ఏఐ సామర్థ్యాలు, దాని నియంత్రణపై ప్రపంచ వ్యాప్తంగా నిపుణుల మధ్య చర్చ ముమ్మరంగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్..

- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్



మొదటిపేజీ తరువాయి.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలను అమలు చేయక పోవడం వల్లే పదేపదే పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో జరిగిన సిగాచీ ప్రమాదం నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కార్మికుల భద్రతను పట్టించుకోకుండా, ప్రమాదాలు జరిగిన తర్వాతే అధికారులు ఫొటోలకు పోజులివ్వడానికి వస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయిన 54 కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీని వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా హరీశ్ రావు గుర్తుచేశారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి.. సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ ఇండ్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ప్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారు ల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీ యేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్.. బీజేపీ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు.

ఎస్‌బీఐ కస్టమర్ల డబ్బుకు ఢోకా లేదు.. డేటా లీక్‌పై బ్యాంకు స్పష్టత

మొదటిపేజీ తరువాయి.. ఇటీవల జరిగిన సైబర్ ఘటనలో 3,897 మంది ఖాతాదారుల వివరాలు డార్క్ వెబ్‌లో బయటపడినప్పటికీ, వారి ఖాతాల్లోని నగదు, నిల్వలు సురక్షితంగానే ఉన్నాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్పష్టం చేసింది. ప్రభావితమైన ఖాతాదారులకు ఈమెయిల్ లేదా వాట్సాప్ ద్వారా వ్యక్తిగతంగా సమాచారం అందించినట్లు శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా బ్యాంకు ప్రకటన విడుదల చేసింది. ఖాతాదారుల నగదు భద్రంగా ఉందని మరోసారి స్పష్టం చేసింది. డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ), పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించింది. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, ఈమెయిళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఈ వారంలోనే ఎస్‌బీఐ తన ఖాతాదారుల సమాచారానికి సంబంధించిన డేటా లీక్ ఘటనను ధ్రువీకరించింది. డార్క్ వెబ్‌లో అందుబాటులో ఉన్న సుమారు 3.75 లక్షల రికార్డులను ప్రాథమికంగా పరిశీలించగా, వాటిలో 3,897 మంది ఖాతాదారులకు సంబంధించిన వ్యక్తిగత గుర్తింపు వివరాలు ఉన్నట్లు గుర్తించామని స్టాక్ ఎక్స్ఛేంజీకి ఇచ్చిన సమాచారం లో పేర్కొంది. థ్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్, డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) నుంచి ఖాతాదారుల సమాచారం బయటపడి ఉండొచ్చన్న హెచ్చరికలు అందినట్లు బ్యాంకు తెలిపింది. లీకైనట్లు గుర్తించిన సమాచారంలో ఖాతాదారుల నమోదిత మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీలు, పేర్లు, లింగం, ఈమెయిల్ చిరునామాలు, నివాస చిరునామాలు ఉన్నట్లు పేర్కొంది. వీటితో పాటు బ్యాంకు శాఖ వివరాలు, సీఐఎఫ్ గుర్తింపు నంబర్లు, లీడ్ ఐడీలు, రుణాలు లేదా ఇతర లీడ్ రికార్డులకు సంబంధించిన మెటాడేటా, ఇతర ఫైళ్ల వివరాలు కూడా ఉన్నట్లు తెలిపింది. ఈ ఘటనపై వెంటనే సైబర్ భద్రతా చర్యలు ప్రారంభించినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. సెర్ట్-ఇన్ గుర్తింపు పొందిన స్వతంత్ర సైబర్ భద్రతా సంస్థను నియమించి సమగ్ర పరిశీలన చేపట్టినట్లు తెలిపింది. బయటపడిన సమాచారం నిజమైనదేనా, దాని పరిధి ఎంత? అది ఎక్కడి నుంచి బయటకు వచ్చింది? దీనివల్ల ఎలాంటి ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొంది.

హైదరాబాద్‌లో తాగునీటి కొరతకు చెక్.. 'గ్రీన్ వాటర్' సరఫరాకు జలమండలి ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లో పెరుగుతున్న నీటి అవసరాలు, తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) వినూత్న ప్రణాళికతో ముందుకొచ్చింది. ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుద్ధి చేసిన మురుగునీటిని (ట్రీటెడ్ వాటర్) నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాలు, రోడ్ల శుభ్రత వంటి పనులకు అందించేందుకు 'గ్రీన్ వాటర్' సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనికోసం నగర శివారులోని కోకాపేటలో ప్రత్యేకంగా ఒక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, అత్యంత విలువైన తాగునీటిని ఇతర అవసరాలకు వాడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఈ ప్రణాళిక అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను సందర్శించి, శుద్ధి చేసిన నీటి నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు, ఏయే ప్రమాణాలు పాటిస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలంటే నాణ్యత విషయంలో రాజీ పడరాదని, నిరంతర పర్యవేక్షణ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. జలమండలి అధికారులతో పాటు 'తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి' (టీజీఎస్‌పీసీబీ) అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎండీ అశోక్‌రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనివల్ల జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే నీటి నాణ్యతను నేరుగా పర్యవేక్షించేందుకు వీలవుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ విధానం వల్ల పర్యవేక్షణలో పారదర్శకత పెరగడమే కాకుండా సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని వివరించారు. గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే ప్రక్రియపైనా అశోక్‌రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి నీటిని నింపేందుకు పరిమితులు విధించాలని ఆదేశించారు. ఏ ట్యాంకర్‌కు ఎంత నీటిని సరఫరా చేశారనే వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, పరిమితికి మించి నీరు నింపకుండా ఆటోమేటిక్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్యాంకర్లు నిండిన తర్వాత అదనంగా మిగిలే నీరు వృథా కాకుండా, దాన్ని తిరిగి సమీపంలోని చెరువుకు మళ్లించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- **రైతుల సహకారంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
- **రత్నగిరిలో రీసర్వే పనులను పరిశీలించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



భీమదేవరపల్లి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను, సర్వేయర్లను ఆదేశించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో కొనసాగుతున్న భూముల పునఃసర్వే ప్రక్రియను ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రోవర్ సాంకేతికతతో భూములను కొలుస్తున్న విధానాన్ని పరిశీలించి, ఇప్పటివరకు ఎన్ని ఎకరాల్లో సర్వే పూర్తయింది, ఇంకా ఎన్ని ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉందనే వివరాలను భూముల కొలతల శాఖ సహాయ సంచాలకుడు నూర్‌సింగ్, సర్వేయర్ విజయభాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. భూముల కొలతల సమయంలో పక్కనే భూములు కలిగిన రైతులు అందుబాటులో ఉంటున్నారా, తమ భూముల హద్దులను స్పష్టంగా చూపిస్తున్నారా అనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. భూ రీసర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో రీసర్వే కీలకమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో సాగవుతున్న వరి పంటను పరిశీలించిన కలెక్టర్.. రైతులతో మాట్లాడి ఏయే పంటలు సాగు చేస్తున్నారు, ప్రస్తుతం పంటలు ఏ దశలో ఉన్నాయనే వివరాలను తెలుసుకున్నారు. వ్యవసాయానికి రోజుకు ఎన్ని గంటల విద్యుత్ సరఫరా అవుతోందని విద్యుత్ శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ లక్ష్మణ్ నాయక్‌ను ప్రశ్నించారు. విద్యుత్ ఉపకేంద్రం పనులు, ఇతర మరమ్మతులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రబీ సీజన్‌లో ఏయే పంటలు సాగు చేయనున్నారని రైతులను, వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజును అడగగా.. జొన్న పంట సాగు చేయనున్నట్లు వారు తెలిపారు. వ్యవసాయ పరిస్థితులు, రైతుల అవసరాలపై కలెక్టర్ వివరాలు సేకరించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రీసర్వే ప్రక్రియను చేపడుతోందని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. సర్వే పనులను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు కూడా తమ భూముల హద్దుల నిర్ధారణలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల, నాయబ్ తహసీల్దార్ సూర్య, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై గండ్ర ఇంటింటా అవగాహన

- **అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి**
- **మార్నింగ్ వాకింగ్‌కు వచ్చిన వారితో పాటు కాలనీల్లో పర్యటించి అవగాహన**





భూపాలపల్లి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి) అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం మార్నింగ్ వాకింగ్‌కు వచ్చిన ప్రజలను గండ్ర వెంకట రమణారెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, అర్హులైన వారు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ, 26వ వార్డులలోని టి2 క్వార్టర్స్, 5వ వార్డులోని కృష్ణ కాలనీ, 24వ వార్డులోని కార్ల్ మార్క్స్ కాలనీలలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను, వారి కుటుంబ సభ్యులను కలుసుకుని ఓటరు నమోదు ఆవశ్యకతను వివరించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని, ఎన్నికల్లో తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ భారత రాష్ట్ర సమితి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కొండా మురళీధర్‌రావు జన్మదిన వేడుకలు

- **భారీ కేక్ కట్ చేసి అన్నదానం ప్రారంభం**
- **మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ**

వరంగల్, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి)వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదిన వేడుకలను వరంగల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అన్నదానం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, వివిధ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, పోటీ చేసిన కార్పొరేటర్ అభ్యర్థులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు వేగం పెంచాలి

- **అటవీ శాఖ అనుమతుల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**



ములుగు, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ములుగు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖాధికారి వికాస్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో సౌర విద్యుత్ దీపాల ఏర్పాటు, బోర్ల తవ్వకం, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, అనుమతుల కోసం పూర్తి వివరాలతో సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అటవీ శాఖ అనుమతుల కారణంగా పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



వరంగల్ /పర్వతగిరి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పర్వతగిరి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తమ పరిధిలోని ప్రతి పట్టభద్రుడిని వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చొరవ చూపాలని కోరారు.ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, కార్యకర్తపై ఉందని ఆరూరి రమేష్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ పట్టభద్రుల ఓటరు నమోదు ఇన్‌ఛార్జి సయ్యద్ మసూద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ పీఎస్ఎల్ చైర్మన్ మనోజ్ కుమార్ గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్, మాజీ జడ్పీటీసీ లూనావత్ పంతులు, మాజీ మండల రైతుబంధు అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల నాయకులు, పట్టభద్రుల ఓటరు నమోదు ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మానేరు వాగులో మునిగి పంచాయతీ కార్యదర్శి మృతి



పెద్దపల్లి జిల్లా / ముత్తారం, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): మానేరు వాగులో ప్రమాదవశాత్తు నీట మునిగి పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు వద్ద చోటుచేసుకుంది. మంథని మండలం సూరయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శనిగరపు జైపాల్ (36) నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో మంథని మండలంలో విషాదచాయలు అలుముకున్నాయి.

భార్యను రక్షించిన స్థానికులు

జైపాల్ తన భార్యతో కలిసి చిట్యాల మండలం టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా, శుక్రవారం ఓడేడు మానేరు వాగు వద్ద స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరూ ప్రమాదవశాత్తు నీట మునిగారు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి జైపాల్ భార్యను రక్షించారు. అయితే జైపాల్ అప్పటికే నీటిలో మునిగిపోయాడు. ఆయన మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

రెండేళ్ల పాపకు తండ్రిని దూరం చేసిన విషాదం

జైపాల్ స్వస్థలం జమ్మికుంట. ప్రస్తుతం రామగిరి మండలం బేగంపేట క్రాస్‌రోడ్డులో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయన భార్య గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. వాగులో మునిగిన ఆమెకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

పోలీసుల కేసు నమోదు

సమాచారం అందుకున్న ముత్తారం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. జైపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంథనికి తరలించారు.

పంచాయతీ కార్యదర్శి జైపాల్ మృతి పట్ల మంథని ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రఘునాథపల్లిలో గిరిజన భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



జనగామ జిల్లా/ రఘునాథపల్లి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):రఘునాథపల్లి మండల కేంద్రంలో గిరిజన భవన్ నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్‌పీఎస్) జనగామ జిల్లా అధ్యక్షుడు కొర్ర రాజేందర్ నాయక్ తహసీల్దార్ రాజేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో గిరిజన భవన్ ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. భవన్‌లో సంత్ సేవాలాల్ జయంతి, తీజ్ పండుగ, గిరిజన ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు గిరిజనుల సమస్యలపై చర్చించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు వారి ఐక్యతకు గిరిజన భవన్ దోహదపడుతుందని తెలిపారు. గిరిజన సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి, భవన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కొర్ర రాజేందర్ నాయక్ కోరారు.

భూక్య భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటాం



వరంగల్ /పర్వతగిరి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని మల్లె తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గడ్డపార తండాకు చెందిన జీపీ సిబ్బంది భూక్య భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంతిమయాత్రలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, కాంటెస్ట్ జెడ్పీటీసీ అభ్యర్థి జాటోత్ శ్రీనివాస్ నాయక్ భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ భూక్య భాస్కర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున, ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్లె తండా సర్పంచ్ భూక్య మంజుల శ్రీనివాస్, ఏనుగల్ సర్పంచ్ తొర్రి పద్మ యాదవ్, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐ భరత్‌కు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



జనగామ జిల్లా, రఘునాథపల్లి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): రఘునాథపల్లి మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ భరత్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జీడికంటి రాజ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మస్సి చంద్రమౌళి ఎస్ఐ భరత్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ములుగు ఆయుష్ విభాగంలో 7 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- అక్టోబర్ 26 నుంచి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నెలకు రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు పారితోషికం

ములుగు, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి)ములుగు జిల్లా ఆయుష్ విభాగంలో జాతీయ ఆయుష్ మిషన్ కింద ఏడు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో పారుగు సేవల ప్రాతిపదికన ఈ నియామకాలు చేపట్టనున్నట్లు జిల్లా ఎంపిక కమిటీ నోడల్ అధికారి డాక్టర్ ఈ. సునీత శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మొత్తం ఏడు పోస్టుల్లో నాలుగు ఆయుష్ వైద్యాధికారులు, ఒక ఫార్మసిస్ట్, ఒక యోగా నిపుణుడు, ఒక మానసిక సామాజిక సలహాదారు పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఆయుష్ వైద్యాధికారులకు నెలకు రూ.40 వేలు, ఫార్మసిస్ట్‌కు రూ.15 వేలు, యోగా నిపుణుడికి రూ.28 వేల పారితోషికం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. మానసిక సామాజిక సలహాదారుకు అవసరమైనప్పుడు సేవలు అందించే ప్రాతిపదికన ఒక్కో సందర్శనకు రూ.500 చెల్లిస్తారని, సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు ఉండేలా నిబంధనలు వర్తిస్తాయని వివరించారు. అభ్యర్థులు 2026 జూలై 1 నాటికి 18 నుంచి 44 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉన్న ఆయుష్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని వెల్లడించారు. దరఖాస్తు నమూనా, విద్యార్హతలు, అవసరమైన ధ్రువ పత్రాలు, ఇతర నియామక నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను ములుగు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://mulugu.telangana.gov.in నుంచి పొందవచ్చని తెలిపారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. నియామకాలకు సంబంధించిన మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ ఈ. సునీతను 99084 31655 నంబరులో సంప్రదించాలని సూచించారు.



వారసత్వ సంపద పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి

- రామప్పలో 12 రోజుల ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం ప్రారంభం
- 10 రాష్ట్రాల నుంచి 35 మంది స్వచ్ఛంద సేవకుల హాజరు

ములుగు, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): [6:48 pm, 23/10/2026] +91 94419 74025: చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై యువత అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, వాటి విశిష్టతను ఇతరులకు తెలియజేస్తూ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ సూచించారు. చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా వాటికి మరింత గుర్తింపు తీసుకురావచ్చని అన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ సౌజన్యంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్పలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం–2026 కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ 12 రోజుల శిక్షణ శిబిరంలో దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 35 మంది స్వచ్ఛంద సేవకులు పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, భూగర్భ శాస్త్రం వంటి విభిన్న అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఈ శిబిరం విద్యార్థులకు చక్కని అవకాశమని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఇక్కడ నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. వారసత్వ సంపద పరిరక్షణపై సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ మాట్లాడుతూ, శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు పర్యాటక శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. పాల్గొనే స్వచ్ఛంద సేవకుల భద్రతకు పర్యాటక పోలీసుల ద్వారా తగిన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. రామప్పకు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు లభించినప్పటి నుంచి వరుసగా ఐదో ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామప్పకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేసిన కృషి, పోషించిన పాత్రను వివరించారు. శిబిరంలో కల్పించే సౌకర్యాలు, పాల్గొనేవారు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. చరిత్రను అధ్యయనం చేయడం, వారసత్వ సంపదను కాపాడటం, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిర సమన్వయకర్త శ్రీధర్ రావు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ పరిరక్షణ సహాయకుడు భార్గవ్, పర్యాటక శాఖ సహాయ పర్యాటక ప్రోత్సాహక అధికారి డాక్టర్ కుసుమ సూర్య కిరణ్, ఆలయ పూజారులు ఉమాశంకర్, హరిశంకర్, పర్యాటక శాఖ సిబ్బంది, పర్యాటక పోలీసులు, దేవస్థానం సిబ్బంది, పర్యాటక మార్గదర్శకులు, వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాజీ కార్పొరేటర్ తూర్పాటి సారయ్యకు ఎర్రబెల్లి నివాళులు

- కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ

వరంగల్, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూర్పాటి సారయ్య ఆకస్మిక మృతిపై రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం సారయ్య నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారయ్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వీడీసీ కమిటీల రద్దుకు ఐక్య ఉద్యమాలు

- **మోకుదెబ్బ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పోరాటం చేపడతాం**
- **దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్**





నిజామాబాద్, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రామ అభివృద్ధి కమిటీల (వీడీసీ) పేరుతో గీత కార్మికులు, దళితులు, బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఆయా కమిటీలను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వివిధ ప్రజాసంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని పల్లె గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రామాలయ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నిజామాబాద్ జిల్లా రెండో మహాసభలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు అమరవేణి నర్సాగౌడ్‌తో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధిరాములు గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజ్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీపతి లింగాగౌడ్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అలల్ సాయిబాబాగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఉపవిభాగంలోని కొన్ని గ్రామాల్లో గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో గీత కార్మికులు, దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కమిటీల నిర్ణయాలను వ్యతిరేకించిన వారిని సాంఘిక బహిష్కరణకు గురిచేస్తూ, భౌతిక దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాజకీయ అండదండలతో బాధితులకు అన్యాయం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.ఇటీవల తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్తులు, దళితులు, వివిధ బడుగు బలహీన వర్గాలకు చెందిన కులవృత్తుల వారిపై జరిగిన దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై వార్తా సేకరణకు వెళ్లిన విలేకరులతో పాటు ప్రభుత్వ అధికారులు, పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులపై దాడులు జరగడాన్ని తీవ్రంగా బట్టారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, బడుగు బలహీన వర్గాల సంఘాలు ఆందోళనలు చేపట్టినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై నాయకులు ప్రశ్నించారు. బీసీ కమిషన్ విచారణ జరిపి, జరిగిన అన్యాయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదని ఆరోపించారు. గ్రామ బహిష్కరణలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు, రెవెన్యూ అధికారులు ఇకనైనా స్పందించి వీడీసీ కమిటీలను రద్దు చేయడంతో పాటు దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మోకుదెబ్బ, తెలంగాణ గౌడ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాల ప్రజలంతా ఐక్యంగా ముందుకు వచ్చి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. గౌడ కులస్తులపై దాడులను అరికట్టేందుకు మోకుదెబ్బ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఈ మహాసభలో రాష్ట్ర నాయకులు బి. కిషన్ గౌడ్, పడాల రాజేందర్ గౌడ్, వేంపల్లి సరోజ గౌడ్, కొండగొని రవీందర్ గౌడ్, పోగుల నగేష్ గౌడ్, జిల్లా నాయకులు చేపూరి జనాగౌడ్, మెరుగు శ్రీనివాస్ గౌడ్, మసగోని రమేష్ గౌడ్, బొజ్జా చిన్నా గౌడ్, రంగుల సిరి గౌడ్, భైరగోని సాయగౌడ్, రంగారి పోషగౌడ్, బూరుగు రాజా గౌడ్, తెలంగాణ గౌడ మహిళా సంఘం నాయకురాళ్లు భైరగోని విజయ, ఉత్కాం లక్ష్మి, బొంగోని భాగ్యలత, మండల నాయకులు సత్య గౌడ్, లింబా గౌడ్, తిరుపతి గౌడ్, ఉపేందర్ గౌడ్‌తో పాటు జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు, గీత కార్మికులు పాల్గొన్నారు.అనంతరం మోకుదెబ్బ నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను షరతుల్లేకుండా క్రమబద్ధీకరించాలి

- **11వ రోజు నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ సంఘీభావం**
- **సమాన పనికి సమాన వేతనం కల్పించాలి: యూనియన్ రాష్ట్ర నాయకుల డిమాండ్**



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, పారుగు సేవల ఉద్యోగులందరినీ షరతుల్లేకుండా క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 20 ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరిన సందర్భంగా శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రామ రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగుల సమ్మెకు యాదాద్రి జిల్లా ఏఐటీయూసీ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ, కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు చెల్లించకుండా తక్కువ వేతనాలతో ఉద్యోగులతో విధులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. నిర్దిష్ట విధులకే పరిమితం చేయకుండా ఇతర పనులను కూడా అప్పగిస్తూ పనిభారాన్ని పెంచడం అన్యాయమన్నారు. జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎంపికైన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు కనీస వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల అంజి యాదవ్ మాట్లాడుతూ, ఇతర ఏడు రాష్ట్రాల్లో ఉద్యోగులను క్రమబద్ధీకరించిన మాదిరిగానే తెలంగాణలోనూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు వేతనాలు కల్పించడం లేదని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్‌హెచ్‌ఎం అన్ని విభాగాల ఉద్యోగులతో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎం.డి. ఇమ్రాన్, అధ్యక్షుడిగా డాక్టర్ షాహిద్ అలీ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బానోత్ నెహ్రూ నాయక్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ హరీష్, డాక్టర్ గిరిజ, ప్రధాన కార్యదర్శిగా జోగు అనూష, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ మాల్యాంక, కోశాధికారులుగా శ్రీదేవి, మధు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జోష్ణ, అన్నపూర్ణ, రమా, చైతన్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శోభన్‌బాబు, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి నరసింహతో పాటు వివిధ విభాగాలకు చెందిన సుమారు 106 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలకు సింగరేణి ద్వారా ఉద్యోగావకాశాలు

- **10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత.. నెలకు రూ.20,733 వేతనం**



పెద్దపల్లి జిల్లా / గోదావరిఖని, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి)::మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సింగరేణి సంస్థ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఏసీపీ మడత రమేష్ తెలిపారు. ఆర్‌జీ-1 పరిధిలోని గోదావరిఖని తిలక్‌నగర్‌లో ఉన్న సప్త డిపార్ట్‌మెంట్ సెంటర్ ద్వారా హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ స్పేర్ పార్ట్స్ తయారీ సంస్థలో మహిళలకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.ఈ ఉద్యోగాలకు 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి, 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సున్న మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.20,733 వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, అటెండెన్స్ బోనస్, నైట్ షిఫ్ట్ అలవెన్స్, ఉచిత రవాణా, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.అర్హత కలిగిన మహిళలు ఈ ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ మడత రమేష్ సూచించారు. ఉద్యోగాలకు సంబంధించిన మరిన్ని వివరాలు, నమోదు కోసం 9494313794, 8792610210 నంబర్లను సంప్రదించాలని కోరారు.

స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథనిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు)లో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
పీఎం శ్రీ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించేందుకు ఐదు నెలల కాలపరిమితితో తాత్కాలిక ప్రాతిపదికన ఈ నియామకం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు.
విద్యార్హతలు ఇవే..
ఈ పోస్టుకు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ లేదా సాధారణ బీఈడీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఏడాది డిప్లామా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు.

ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా మంథనిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు) ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని ఊటూరి శ్రీనాథ్ సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

పుట్టినరోజు వేడుకల్లో సేవా స్ఫూర్తి



పెద్దపల్లి జిల్లా/ కమాన్‌పూర్, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):పుట్టినరోజు వేడుకలను సామాజిక సేవతో ముడిపెట్టి హెల్పింగ్ హాండ్స్ సంస్థ అధ్యక్షుడు నారగోని సతీష్ గౌడ్ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు 23 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ చేతుల మీదుగా ఈ సరుకులను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా నిలవడం అభినందనీయం

ఈ సందర్భంగా సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ సంస్థ ద్వారా నారగోని సతీష్ గౌడ్ అనేక మందికి వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవలో తనవంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు పరిమితం చేయకుండా, గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.
గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని, వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు.
అనంతరం నారగోని సతీష్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.
ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ గ్రామ ఉపసర్పంచ్ మహమ్మద్ రఫిక్ సోహెల్, హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి



పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని కాసిపేట శివారు పరిధిలో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంజపడుగు గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంథని తహసీల్దార్ ఆదేశాల మేరకు భూముల రీ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. భూ యజమానులు తమ భూముల సరిహద్దులు, సర్వే నంబర్లు, విస్తీర్ణం రెవెన్యూ రికార్డుల్లో సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. రీ సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో భూముల వివరాలను పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో సరిపోల్చుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కాసిపేట శివారు పరిధిలో భూములు కలిగిన రైతులందరూ రీ సర్వే కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత భూ రికార్డులు, సర్వే నంబర్ల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జీపీఓ రవీందర్, లైసెన్స్‌డ్ సర్వేయర్లు సాగర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయే చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం కల్పించాలి



పెద్దపల్లి జిల్లా, మంథని, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):మంథని పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా దుకాణాలు కోల్పోయే చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని మంథని మున్సిపల్ పాలకవర్గం కోరింది. ఇందుకోసం ఆర్టీసీ బస్టాండ్‌కు చెందిన కొంత స్థలాన్ని కేటాయించి, అవసరమైన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది.
ఈ మేరకు మంథని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యుడు ఎల్లెంకి వంశీధర్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

చిరు వ్యాపారుల ఉపాధికి భరోసా కల్పించాలి

రోడ్డు విస్తరణ పనుల వల్ల ప్రస్తుతం ఉన్న దుకాణాలు తొలగించే పరిస్థితి ఏర్పడుతుందని, వాటిపై ఆధారపడి జీవిస్తున్న చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని మున్సిపల్ ప్రతినిధులు వివరించారు. పట్టణ అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా, అదే సమయంలో చిరు వ్యాపారుల జీవనోపాధికి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.
ఆర్టీసీ బస్టాండ్‌కు చెందిన కొంత స్థలాన్ని కేటాయించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే, దుకాణాలు కోల్పోయే వ్యాపారులకు తిరిగి వ్యాపారాలు నిర్వహించుకునే అవకాశం కల్పించవచ్చని తెలిపారు. దీనివల్ల వ్యాపారుల కుటుంబాలకు ఉపాధి భద్రత లభించడంతో పాటు పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించాలి

మంథని పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదనను పరిశీలించాలని మంత్రులు, ఆర్టీసీ ఎండీని మున్సిపల్ ప్రతినిధులు కోరారు. స్థల కేటాయింపు, నిర్మాణ అనుమతులు, నిధుల మంజూరుపై సానుకూల నిర్ణయం తీసుకొని ప్రాజెక్టు ముందుకు సాగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణతో పాటు చిరు వ్యాపారుల ప్రయోజనాలను పరిరక్షించేలా ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యుడు ఎల్లెంకి వంశీధర్ కోరారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి



హన్మకొండ, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా, బాధ్యతాయుతంగా చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన ప్రతి పట్టభద్రుడిని నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు డివిజన్ల వారీగా ప్రత్యేక ఇనచార్జిలను నియమించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గరిష్ట సంఖ్యలో పట్టభద్రుల ఓట్లు నమోదయ్యేలా పార్టీ యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

అక్టోబర్ 25న నియోజకవర్గ స్థాయి సమీక్ష

ఇప్పటివరకు జరిగిన ఓటరు నమోదు పురోగతిని సమీక్షించడంతో పాటు తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందించేందుకు అక్టోబర్ 25న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలపై చర్చించనున్నారు.

జిల్లా కేంద్రంలో కొవ్వుత్తుల ర్యాలీ నిర్వహణ.

ములుగు జిల్లా, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులర్పించేందుకు ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకాన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సదానందం గారి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ములుగు బస్టాండ్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏరియా హాస్పిటల్ జంక్షన్ వరకు వెళ్లి తిరిగి బస్టాండ్ జంక్షన్ వద్దకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన అమరవీరుల ఫ్లెక్సీ వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.దేశ భద్రత, ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రజలకు తెలియజేయడంతో పాటు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సాహసం, అంకితభా



వాన్ని స్మరించుకోవడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో ములుగు డి.ఎస్.పి రవీందర్, ఆర్ ఐ స్వామి, శ్రీకాంత్, తిరుపతి, ఎస్సైచ్ఓ వెంకటేష్, ఎస్సై లు చంద్రశేఖర్, రచిత్ర, సాయి కృష్ణ, ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.పి ఆర్ ఒ ములుగు జిల్లా పోలీస్

బాపూజీ ఉద్యమ వారసుడికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

- **గవర్నర్ కోటాలో దాసు సురేష్‌కు పదవి ఇవ్వాలి**
- **చేనేత పద్మశాలి, బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం**

హైదరాబాద్, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధన కోసం నిరంతరం పోరాడుతూ, చేనేత పద్మశాలీల హక్కులు, బీసీల రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని చేనేత పద్మశాలి, బీసీ సామాజిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చేనేత పద్మశాలి, బీసీ సామాజిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షుడు దొంత ఆనందం అధ్యక్షత వహించగా, పోషాల సరస్వతి, చిక్కా దేవదాస్ సమావేశ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు బొమ్మ నరేందర్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం దాసు సురేష్ నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలనే డిమాండ్‌పై గత ప్రభుత్వంపై సుదీర్ఘకాలం ఒత్తిడి తీసుకొచ్చి, ఆ హక్కు సాధనకు కీలకంగా కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకుడికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు.బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి మాట్లాడుతూ, ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కార్మికుల కుటుంబాలకు దాసు సురేష్ ఆర్థికంగా, నైతికంగా అండగా నిలిచారని అన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో వారిని వెంటబెట్టుకొని ఢిల్లీలోనూ పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పనిచేసే



నాయకుడికి చట్టసభల్లో అవకాశం కల్పిస్తే బీసీల సమస్యలను బలంగా వినిపించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు.సీనియర్ పాత్రికేయుడు తులసి శ్రీమాన్ మాట్లాడుతూ, సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా దాసు సురేష్ ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో సాగిన ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం ఏర్పడిన తెలంగాణ బీసీ ఐక్య కార్యాచరణ సమితికి సహ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం కావడంలో కృషి చేశారని వివరించారు.చేనేత పద్మశాలి సమాజంతో పాటు రాష్ట్రంలోని బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం కోసం దాసు సురేష్ చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు కోరారు. బీసీ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ, అట్టడుగు వర్గాల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్తున్న ఆయనకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆయా వర్గాల సమస్యలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని అభిప్రాయపడ్డారు .ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు గౌరవం ఇవ్వడంతో పాటు చేనేత పద్మశాలీలు, బీసీ వర్గాల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని దాసు సురేష్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బోరా సుభాష్ చంద్రబోస్, పెండెం ధనుంజయ, బోనం ఊర్మిళ, సాజిదా సికిందర్, ఊరుగొండ శివ, ప్యారసాని దుర్గేశ్, మంద వెంకట స్వామి, ఏలే బాలకృష్ణ, మంద ఈశ్వర్, పాక శ్రీనివాస్, తలకొక్కుల శ్రీశైలం తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి మండలంలో ఆలయాల్లో వరుస చోరీలు

హనుమకొండ /ఎల్కతుర్తి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో దేవాలయాల్లో చోటు చేసుకుంటున్న చోరీ ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. మండల కేంద్రంలోని ఓ దేవాలయంతో పాటు సూరారం గ్రామంలోని గుడిబండపల్లె దేవాలయంలోనూ గుర్తుతెలియని వ్యక్తులు పూజా గంటలు, నిత్య పూజా సామగ్రిని అపహరించినట్లు సమాచారం. మండలంలోని పలు గ్రామాల్లో గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వరుస చోరీలతో భక్తులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల భద్రతపై దృష్టి సారించాలి

ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోని దేవాలయాల్లో గతంలో జరిగిన చోరీ ఘటనల వివరాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. పూజా గంటలు, నిత్య పూజా సామగ్రి అపహరణకు గురవుతుండటంతో ఆలయాల భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. తాజా ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జాతీయ రహదారి పరిసరాల్లో నిఘా పెంచాలి

మండల పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి, గ్రానైట్ పరిశ్రమలు ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఉపాధి కోసం వచ్చి నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పద కదలికలపై పోలీసులు నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. అయితే, ఎలాంటి ఆధారాలు లేకుండా వ్యక్తులను అనుమానించకుండా,



వాస్తవాల ఆధారంగా విచారణ జరపాలని సూచిస్తున్నారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి

మండలంలోని దేవాలయాలు, ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఆలయాల నిర్వాహకులు కూడా భద్రతా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.
దేవాలయాల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని ఎల్కతుర్తి మండల ప్రజలు కోరుతున్నారు. తాజా చోరీ ఘటనలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాక్షస గుహలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- **ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న వసతి గృహం..**
- **ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని స్థానికుల విజ్ఞప్తి**





ములుగు జిల్లా,తాడ్వాయి, అక్టోబర్ 23(నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని దామరవాయి–భూపతిపురం ఉమ్మడి అటవీ ప్రాంతంలో ఉన్న పురాతన రాక్షస గుహలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల గ్రామ అన్వేషణ గైడ్ కార్తీక్ ఈ ప్రాంతంలో అద్భుతమైన గుహను గుర్తించినట్లు తెలిసింది. ఈ గుహలో జింకలు ఆవాసం ఏర్పరచుకున్నాయని, లోపలికి వంగి వెళ్లిన తర్వాత మరో పెద్ద గుహ కనిపిస్తుందని, అక్కడ సుమారు 20 నుంచి 30 మంది నిలబడేందుకు స్థలం ఉందని వివరించారు.

దామరవాయి సమీపంలోని మద్దెనకుంట ప్రాంతంలోనూ పురాతన రాక్షస గుహలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ప్రకృతి అందాలతో పాటు చారిత్రక ప్రాధాన్యాన్ని సందర్శకులకు పరిచయం చేసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

గతంలో సర్వే.. నిధుల మంజూరు

గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి అజ్మీర చందూలాల్ ఈ ప్రాంతాన్ని సందర్శించి, అధికారులతో సర్వే చేయించినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. గుహల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, పనులు చేపట్టినట్లు తెలిపారు. వసతి గృహ నిర్మాణం పూర్తయిందని, తాగునీటి కోసం బోరు కూడా వేయించారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత తదుపరి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రస్తుతం ఆ వసతి గృహం, బోరు నిరుపయోగంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటక ప్రాంతాల అనుసంధానంతో ప్రయోజనం

దామరవాయి ప్రాంతానికి సమీపంలో మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కోమటిపల్లి ముక్కిడి పోచమ్మ ఆలయం, వాజేడు పరిధిలోని పాగత జలపాతం, మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయాలు ఉన్నాయి. ఈ పర్యాటక ప్రాంతాలతో పాటు రాక్షస గుహలను కూడా అభివృద్ధి చేస్తే మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి, వాజేడు మండలాల ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పర్యాటకులకు మరో ఆకర్షణీయమైన ప్రదేశం అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు.

మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలి

ప్రస్తుతం నిలిచిపోయిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు. మంత్రి సీతక్క చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో గుహల ప్రాంతాన్ని పరిశీలింపజేసి, పర్యాటక అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పురాతన గుహల ప్రాధాన్యాన్ని అధ్యయనం చేసి, అటవీ పర్యావరణానికి నష్టం కలగకుండా తగిన వసతులు కల్పిస్తే ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తవ్వితే కఠిన చర్యలు



జనగామ జిల్లా /లింగాల ఘన్‌పూర్, అక్టోబర్ 23 (నిత్యం నిఘా): ప్రభుత్వ అనుమతులు లేకుండా చీటూరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తవ్వినా, రవాణా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని లింగాల ఘన్‌పూర్ ఎస్ఐ కె. కిషోర్ హెచ్చరించారు.చీటూరు గ్రామంలో గ్రామ పెద్దలు, ట్రాక్టర్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చీటూరు వాగు పరివాహక ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించి ఇసుక రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఎక్కడైనా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామ పెద్దలు, ప్రజలకు ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, ట్రాక్టర్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పర్వతగిరి పోలీసులు

- **112కు కాల్‌తో వెంటనే స్పందన.. సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ గుర్తింపు**
- **వ్యక్తిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన సిబ్బంది**

వరంగల్ జిల్లా/ పర్వతగిరి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):ఆపదలో ఉన్న వ్యక్తిని సకాలంలో గుర్తించి, సురక్షితంగా కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన పర్వతగిరి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర సమాచారం అందిన వెంటనే స్పందించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యక్తి ఆచూకీ గుర్తించడంతో ఓ ప్రాణాన్ని కాపాడగలిగారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన మహమ్మద్ భాష వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ విషయాన్ని 112 అత్యవసర సేవలకు ఫోన్ చేసి తెలియజేయడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు.

ఆ సమయంలో బ్లూకోల్ట్ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది శ్రావణ్, సుందర్‌లు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో మహమ్మద్ భాష ఆచూకీని గుర్తించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా అక్కడికి చేరుకుని, అతడిని సురక్షితంగా కాపాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, అతడిని కుమారుడికి అప్పగించారు.

సమయస్ఫూర్తితో ప్రాణరక్షణ

వ్యక్తిగత సమస్యలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలని, ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని పోలీసులు అతడికి సూచించారు. ఆపదలో ఉన్నవారిని రక్షించడం తమ ప్రథమ కర్తవ్యమని తమ చర్యల



ద్వారా చాటిచెప్పారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు

సమయానికి స్పందించి వ్యక్తిని సురక్షితంగా కాపాడిన పోలీసు సిబ్బంది శ్రావణ్, సుందర్‌లను ఉన్నతాధికారులు, స్థానిక గ్రామస్తులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల వేగవంతమైన స్పందన, సేవా దృక్పథంపై ప్రశంసలు వ్యక్తం చేశారు.

కోచ్ ఫ్యాక్టరీ భూనిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం



హన్మకొండ, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):హన్మకొండ జిల్లా మడికొండ సమీపంలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ (కోచ్ ఫ్యాక్టరీ) నిర్మాణ పనులను ఆల్ ఇండియా రైల్వే బోర్డు సభ్యుడు సునీల్ కుమార్ పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతి, నిర్మాణ పనుల తీరును రైల్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఈ సందర్భంగా అయోధ్యపురం గ్రామానికి చెందిన పది మంది భూనిర్వాసితులు సునీల్ కుమార్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం తమ విలువైన భూములను ఇచ్చామని, ఈ ప్రాజెక్టుతో తమ కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని ఆశించామని తెలిపారు. తమ కుటుంబాల్లోని అర్హులకు ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.భూనిర్వాసితుల వినతిపై సునీల్ కుమార్ సానుకూలంగా స్పందించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూములు ఇచ్చిన వారి త్యాగం అభినందనీయమని పేర్కొన్నారు. భూనిర్వాసితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మడికొండ సీఐ పుల్యాల కిషన్, స్థానిక రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం నిఘా కథనానికి స్పందన.. గోతుల పూడ్చివేత

- **వరుస కథనాలతో కదలిక.. ప్రయాణికులకు ఊరట**
- **అధికారుల ఆదేశాలనూ పట్టించుకోలేదన్న విమర్శలు.. చివరకు స్పందించిన గ్రానైట్ కంపెనీలు**

వరంగల్/ఐనవోలు, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారిపై పంతిని గ్రామ శివారులో వెంకటేశ్వర, అరుణ గ్రానైట్ కంపెనీల నిర్లక్ష్యంతో ప్రమాదకరంగా మారిన గోతుల సమస్యపై 'నిత్యం నిఘా' దినపత్రిక ప్రచురించిన వరుస కథనాలకు స్పందన కనిపించింది. రహదారి పక్కన ఉన్న గోతులను తాజాగా పూడ్చివేయడంతో అటువైపు ప్రయాణించే వాహనదారులకు కొంత ఊరట లభించింది.

గత కొంతకాలంగా ప్రధాన రహదారి పక్కన గోతులు తవ్వి అలాగే వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గోతుల కారణంగా ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ సంబంధిత కంపెనీలు సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించాయనే విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ సమస్యపై పలు సందర్భాల్లో పత్రికా కథనాలు ప్రచురితమైనప్పటికీ, సంబంధిత అధికారులు సూచనలు చేసినా పరిస్థితిలో మార్పు రాలేదని స్థానికులు పేర్కొన్నారు. ఈ క్రమంలో 'నిత్యం నిఘా' వరుస కథనాల ద్వారా సమస్యను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు గోతులను పూడ్చివేసే చర్యలు చేపట్టారు.



దీంతో పత్రికా కథనాల ప్రభావంతో సమస్య పరిష్కార దిశగా అడుగు పడిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజా సమస్యలపై అక్షర పోరాటం.. 'నిత్యం నిఘా' లక్ష్యం!



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రశ్నించడమే ప్రజాప్రయోజన జర్నలిజం లక్ష్యమని ఈ పరిణామం మరోసారి చాటిచెప్పింది. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే ప్రజల తరపున ప్రశ్నించడం కొనసాగుతుందని 'నిత్యం నిఘా' స్పష్టం చేస్తోంది.

అయితే గోతులను పూడ్చివేయడంతోనే బాధ్యత ముగిసిపోదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, రహదారికి నష్టం కలిగించే పనులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి, రహదారులపై ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల పక్షాన.. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా.. 'నిత్యం నిఘా' అక్షర పోరాటం కొనసాగుతుంది!

బీసీ-ఏ వర్గీకరణపై సీఎం ప్రకటన అభినందనీయం

హన్మకొండ, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి):ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి మారుస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడంపై మెపా (MEPA) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం ప్రకటనను స్వాగతిస్తున్నామని, ఈ నిర్ణయం ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రయోజనకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.హన్మకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముదిరాజ్‌ల చిరకాల డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. బీసీ-ఏ వర్గీకరణ అమలైతే ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విద్యా, ఉద్యోగ రంగాల్లో మెరుగైన అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ అంశంపై పరిశీలన కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయడాన్ని కూడా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక, చారిత్రక పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి, సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఉపసంఘాన్ని కోరారు.ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు వేగవంతం చేయాలని, వర్గీకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పులి దేవేందర్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్ర మాలపై సమీక్ష సమావేశం



నిత్యం నిఘా, హుస్నాబాద్, అక్టోబర్ 23 : హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాల యంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి కొండల్ రెడ్డి సమక్షంలో గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల సామర్థ్య పెంపుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి కొండల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, ప్రజాప్రతినిధులు తెలియజేసిన సమస్యలను అధికారులు నోట్ చేసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని, రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, మంత్రి పొన్నం ప్రభాకర్ అందించిన స్టీల్ బ్యాంకులను వినియోగించాలని పిలుపుని చ్చారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇలాంటి సమీక్ష సమావేశాల ద్వారా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆత్మ కమిటీ చైర్మన్ జంగాపల్లి ఐలయ్య మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో హుస్నాబాద్ ఎంపీడీవో సురేష్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్య దర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన

రజిని రజినీకాంత్ గౌడ్.



నిత్యం నిఘా, రాజేంద్ర నగర్, అక్టోబర్ 23 : దసరా పండుగను పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పండగ శుభాకాంక్షలు తెలపడం జరిగిందని రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె రజినీకాంత్ గౌడ్,ఆయన కుమారుడు హర్షిత్ గౌడ్ తో కలిసి ఆయన తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గా కన్నోజు రామకృష్ణ



నిత్యం నిఘా, హుస్నాబాద్, అక్టోబర్ 23 : హుస్నాబాద్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు మాజీ ఏజీపీ కన్నోజు రామకృష్ణను హుస్నాబాద్ నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గా మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ శుక్రవారం రోజున నియమిం చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం బిఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ గా తన వంతు బాధ్యతలు సామ ర్థవంతంగా నిర్వహించాలని నాయకుల కార్యకర్తల కేసుల సమస్యలు త్వరత్వరగా పరిష్కరిం చేందుకు న్యాయ సలహాలు ఇస్తూ కృషి చేయాలని కోరారు. అనంతరం కన్నోజు రామకృష్ణ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పజెప్పిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధికి కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు బిఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ గా కృషి చేస్తానని తెలిపారు.పలువురు నాయకులు కన్నోజు రామకృష్ణకు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమష్టిగా సిద్ధం కావాలి



వరంగల్/పర్వతగిరి, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో సమష్టిగా సిద్ధం కావాలని పర్వతగిరి మండల స్థాయి అధికా రులు సూచించారు. నీరు, విద్యుత్ వినియో గంలో పొదుపు పాటించడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.వరంగల్ జిల్లా పర్వతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాలోతు శంకర్ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే పరిస్థితులు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి కె. నీరజ ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ముఖ్యంగా నీరు, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్స హించాలని, వ్యవసాయ భూముల్లో వ్యవసాయ కుంటల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని సమర్థంగా ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడి పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ దిశగా గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని స్పష్టం చేశారు.అలాగే వీబీ–గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అన్ని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమ న్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయిలో ముందస్తు జాగ్రత్తలపై అవగాహన పెంపొందిం చాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీఓ శేషు, వ్యవసాయ అధికారి, ఏపీఓ, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యద ర్శులు, వీబీ–గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ఆయిల్‌ఫామ్ రైతులు అప్రమత్తంగా ఉండాలి



వరంగల్ / వర్ధన్నపేట, అక్టోబర్ 23 (నిత్యం నిఘా ప్రతినిధి) : మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆయిల్‌ఫామ్ రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వర్ధన్న పేట మండల అధ్యక్షుడు తక్కళ్లపెల్లి సత్యనారా యణ రావు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో తోటల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వర్ధన్న పేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన రైతు తాళ్లపెల్లి రమేష్ సాగు చేస్తున్న ఆయిల్‌ఫామ్ తోటను శుక్రవారం సత్యనారాయణ రావు సంద ర్శించారు. ఈ సందర్భంగా తోటలోని చెట్ల పెరుగు దల, సాగు విధానం, నిర్వహణ తీరును పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు. వాతావరణ పరి స్థితులకు అనుగుణంగా తోటను నిర్వహించాలని, చెట్లపై ప్రతికూల ప్రభావం పడకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రైతులకు కమిటీ అండగా ఉంటుంది

ఆయిల్‌ఫామ్ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వారికి అవస రమైన అవగాహన కల్పించడమే లక్ష్యంగా కమిటీ సభ్యులు పనిచేస్తారని సత్యనారాయణ రావు తెలిపారు. సాగుకు సంబంధించిన సందేహాలు, సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. సంబంధిత సూచనలు పాటిస్తూ తోటల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

ఆయిల్‌ఫామ్
సాగులో రైతులకు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కమిటీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

గ్రామీణ యువతకు న్యాక్ బంపర్ ఆఫర్!

- **నాలుగు సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు**
- **మూడు నెలల పాటు ఉచిత శిక్షణ,భోజనం,వసతి**
- **అర్హత పదో తరగతి,18–35 ఏళ్ల యువతకు అవకాశం**
- **నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం పిలుపు.. చుట్టుపక్కల గ్రామాల యువత సద్వినియోగం చేసుకోవాలి**



నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 23 : గ్రామీణ నిరుద్యోగ యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని న్యాక్ కేంద్రంలో నాలుగు విభాగాల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నంది పేట్,డొంకేశ్వర్ మండలాలతోపాటు పరిసర గ్రామాల యువత సద్వినియోగం చేసుకోవాలని నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం కోరారు.నాలుగు కోర్సుల్లో శిక్షణల్యాండ్ సర్వేయర్, కన్స్ట్రక్షన్ ఎల క్ట్రీషియన్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్, పెయింటింగ్ అండ్ డెకరేషన్ కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ అ ందించ నున్నారు. ల్యాండ్ సర్వేయర్,సూపర్‌వైజర్ స్ట్రక్చర్ కోర్సులకు ఇంట ర్మీడియట్ ఉత్తీర్ణత లేదా డిప్లామా,ఐటీఐ అర్హత ఉండాలి. కన్స్ట్రక్షన్ ఎలక్ట్రీషియన్,పెయింటింగ్ అండ్ డెకరేషన్ కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణత లేదా ఐటీఐ అర్హత అవసరం.18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.భోజనం, వసతితోపాటు సాంకేతిక శిక్షణశిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు టీ-షర్ట్, హెల్మెట్, భద్రతా షూస్ అందించనున్నారు. సాంకేతిక నైపు ణ్యాలకు అదనంగా స్పోకెన్ ఇంగ్లీష్,సాఫ్ట్ స్కిల్స్,కంప్యూటర్ శిక్షణ కూడా ఇవ్వనున్నారు.కో ర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి న్యాక్ సర్టిఫికెట్‌తోపాటు ఎన్ఎస్‌డీసీ సంబంధిత సర్టిఫి కెట్ అందజేస్తారు.శిక్షణ అనంతరం ఉద్యోగావకా శాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.అవస రమైన ధ్రువపత్రాలు ఇవేఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు,తెల్ల రేషన్ కార్డు,ఆధార్ కార్డు,కుల ధ్రువీకరణ పత్రం,ఫొటోలు,బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ ప్రతులను సిద్ధం చేసుకోవాలి.వివరాలకు సంప్రదించండిన్యాక్ నిజా మాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ 9296507557 నంబర్‌తోపాటు 9704587655, 9959773079, 9866350200 నంబర్లను సంప్రదించి శిక్షణ,నమోదు వివరాలు తెలుసుకోవచ్చు.యువ తకు సర్పంచ్ పిలుపు: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకుని సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకో వాలని,శిక్షణ ద్వారా ఉపాధి పొందే దిశగా ముందడుగు వేయాలని నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం సూచించారు.ముఖ్యంగా నందిపేట్,డొంక ేశ్వర మండలాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన



నిత్యం నిఘా, కేశంపేట, అక్టోబర్ 23 : పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు–2026లో భాగంగా కేశంపేట పోలీస్ స్టేషన్‌లో గ్లోబల్ స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిం చారు. పోలీస్ కమిషనర్, డీసీపీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్ర మంలో పోలీస్ శాఖ విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పోలీస్ స్టేషన్ పనితీరు, కేసుల నమోదు, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను వివరిం చారు. వీఎచ్ఎఫ్ వైర్‌లెస్ సెట్లు, బ్రీత్ ఎనలైజర్లు, లాఠీలు, పోలీస్ ఆయుధా లను పరిచయం చేసి వాటి వినియోగం, ప్రాముఖ్యతను తెలియజేశారు.అలాగే రహదారి భద్రత, సైబర్ నేరాల నివారణ, బాలల భద్రత, క్రమశిక్షణపై సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం, పోలీసుల పట్ల సానుకూల దృక్పథాన్ని కల్పించడం, పోలీస్–ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే కార్యక్రమం ఉద్దేశమని కేశంపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస్ తెలిపారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com